అనుమానాస్పదం

- జోగులాంబ గద్వాల జిల్లాలో పెరుగుతున్న మృతులు
- ట్రాన్స్‌జెండర్‌లే కారణమంటూ ఆరోపణలు
- దౌర్జన్యంగా వసూళ్లకు కళ్లెం వేసిన పోలీసులు

7

విద్య మరింత చేరువ

- పాలమూరులో నైపుణ్యాభివృద్ధి శిక్షణపై ఫోకస్
- ఇప్పటికే మహబూబ్‌నగర్ ఫస్ట్ నవరత్నాల మొదటి బ్యాచ్ పూర్తి
- 'మాస్టర్' కింద వైఐఎస్‌యూ ద్వారా ఈ ఏడాది నుంచి శిక్షణ
- టెట్, డీఎస్సీ, ఎస్ఐ, కానిస్టేబుల్ పరీక్షలకు ఉచిత తరగతులు
- సర్కారు బడుల బాగుకోసం విద్యానిధి ద్వారా నిధుల సేకరణ
- ఈ ఏడాది నుంచి ఇంజనీరింగ్, లా తరగతులు కూడా ప్రారంభం



మహబూబ్‌నగర్ ఫస్ట్ నవరత్నాలు కార్యక్రమం ప్రారంభంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, చిత్రంలో కలెక్టర్ విజయేందిర బోయి, ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జీ మధుసూదన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్ తదితరులు(ఫైల్)

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పాలమూరు జిల్లా కేంద్రంలో విద్యార్థులకు అవకాశాలు మెరుగుపడుతున్నాయి. సౌకర్యాలు అందుబాటులో లేక పోటీ పరీక్షలకు, నైపుణ్యాభివృద్ధి కోసం పట్టణాలకు వెళ్లే విద్యార్థులు ఇప్పుడు ఎంచక్కా ఇక్కడే శిక్షణ పొందొచ్చు. ఆర్థిక పరిస్థితి బాగోలేని వారికి అందుబాటులో విద్య దొరకడంతో విద్యార్థులకు వెసులుబాటు దొరకనుంది. కేవలం చదువకునే వారికి విద్యనే కాకుండా.. వివిధ కారణాలతో పదో తరగతిలోపే చదివిన వారి నుంచి పీజీ పూర్తి చేసుకున్న వారి వరకు నైపుణ్యాభివృద్ధి కోసం శిక్షణ అందిస్తున్నారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ నవరత్నాలు, మాస్టర్, టెట్, కానిస్టేబుల్, ఎస్ఐ, డీఎస్సీ ఇతర పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ.. ఐటీఐని అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌గా మార్చడం, పాలమూరు యూనివర్సిటీకి కొత్తగా ఇంజనీరింగ్, లా కాలేజీ మంజూరు చేయించడం, సర్కారు బడుల బాగు కోసం విద్యానిధి ద్వారా నిధుల సేకరణ తదితర కార్యక్రమాలు ప్రస్తుతం నడుస్తున్నాయి. కొన్నింటిలో ఇప్పటికే శిక్షణ ప్రారంభం కాగా.. ఈ ఏడాది నుంచి మరి కొన్ని కళాశాలల్లో తరగతులు ప్రారంభం కానున్నాయి. వీటివల్ల విద్యార్థుల్లో సామర్థ్యం పెరిగి.. ఉపాధి పొందేందుకు వీలుపడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నవరత్నాలు.. మొదటి బ్యాచ్ పూర్తి..

మహబూబ్‌నగర్ నగరంలోని టీకేరెడ్డి కాలనీలో మహబూబ్‌నగర్ ఫస్ట్ నవరత్నాల పేరిట సెట్విన్, ప్రభుత్వం, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సంయుక్తంగా ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఇందులో మహిళలకు బ్యూటీషియన్, కంప్యూటర్ ట్రైనింగ్, టైలరింగ్(ఫ్యాషన్ డిజైనింగ్)లో శిక్షణ అందిస్తున్నారు. ఇప్పటికే 240 మందికి మొదటి బ్యాచ్ శిక్షణ పూర్తి కాగా, సర్టిఫికెట్లు కూడా అందజేశారు. శిక్షణ పూర్తి చేసుకునే రోజు బ్యాంకర్లతో మీటింగ్ ఏర్పాటు చేసి.. వారి స్వయం ఉపాధి కోసం రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ప్రస్తుతం ఈ కోర్సులతో పాటు మగ్గం వర్క్‌ను కూడా కలిపి మొత్తం నాలుగు కోర్సుల్లో 250 మందికి శిక్షణ అందిస్తున్నారు.

మాస్టర్ ఈ ఏడాది నుంచే..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో భాగంగా ఈ ఏడాది డిగ్రీ

(మిగతా 6లో..)

నైపుణ్యాభివృద్ధి, ఉపాధి పెంపే లక్ష్యం

మహబూబ్‌నగర్‌లో విద్యార్థులను మూడు కేటగిరీలుగా విభజించాం. స్కూల్ వరకే చదువుకున్నవారు, టెన్త్ పూర్తయిన వారు, ఆపై చదివిన వారు ఇలా వారి చదువుకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక విద్య అందించడమే ధ్యేయంగా పని చేస్తున్నాం. నైపుణ్యం ఉంటేనే ఉపాధి లభిస్తుందని నమ్ముతున్నాం. ఇప్పటికే ఏటీసీ, టాస్క్, మాస్టర్, పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ, నవరత్నాలు ఇలా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాం.

- యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే, మహబూబ్‌నగర్



ఎస్ఎల్‌బీసీలో ఎక్స్‌కవేటర్ సహాయంతో శిథిలాలు తొలగిస్తున్న సహాయక సిబ్బంది

డేంజర్ జోన్ వరకు వెంటిలేషన్ పునరుద్ధరణ

- ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి
- మిగిలిన 70 మీటర్లలో 50 మీటర్లకు శిథిలాలు తిరుగతోడిన రెస్క్యూ బృందాలు
- ఆ ఆరుగురి ఆచూకీ 20 మీటర్లలో ఉండొచు?

7

నీట మునిగి ఒకరి మృతి

నలుగురి గల్లంతు

- దివిటిపల్లి వద్ద ఈత కోసం వెళ్లి క్వారీలో మునిగిపోయిన ముగ్గురు
- బయటపడిన వ్యక్తి మృతి, మరో ఇద్దరి కోసం గాలింపు
- బాలానగర్ మండలం గంగాధరపల్లి చెరువులో మరో ఇద్దరి గల్లంతు



గల్లంతైన వారికోసం క్వారీలో గాలిస్తున్న పోలీసులు



మృతి చెందిన విజయ్, గల్లంతైన అయ్యప్ప, ఎండీ మహమూద్(ఫైల్)

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలో సోమవారం చోటు చేసుకున్న వేర్వేరు ఘటనల్లో ఐదుగురు గల్లంతయ్యారు. అందులో ఒకరు ఈదుకుంటూ బయటికి వచ్చి మృతి చెందగా, మిగతా నలుగురి కోసం గాలిస్తున్నారు. మహబూబ్‌నగర్ నగరపాలిక పరిధిలోని దివిటిపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సమీపంలో గల క్వార్రీ వద్ద, బాలానగర్ మండలం గంగాధరపల్లి చెరువు వద్ద ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి.

రాకసి క్వారీ మళ్లీ కోరలు చాచింది... ఐదేళ్ల క్రితం ఇద్దరిని బలితీసుకున్న క్వారీ సోమవారం మరో ముగ్గురిని మింగేసింది.. వీరిలో ఒకరి మృతదేహం ఒడ్డుకురాగా, మిగతా ఇద్దరు గల్లంతయ్యారు.. వారి ఆచూకీ కోసం రెస్క్యూ కొనసాగుతోంది. పాలమూరు కార్పొరేషన్ పరిధిలోని దివిటిపల్లికి చెందిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ళ సముదాయంలో నివాసం ఉంటున్న ఐదుగురు యువకులు సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో సమీపంలోని క్వారీలోని

(మిగతా 6లో..)



మహబూబ్‌నగర్ రూరల్ మండలం మన్యంకొండ ఆలయ ప్రధాన ద్వారం వద్ద వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఊడుస్తున్న రైతు కుటుంబ దీకులు

అకాల వర్షం

- మహబూబ్‌నగర్ రూరల్ మండలం, దేవరకద్ర మార్కెట్‌లో తడిసిన ధాన్యం
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు

6



మహబూబ్‌నగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీ డీకే అరుణ, చిత్రంలో కలెక్టర్ విజయేందిర బోయి

అంబేడ్కర్ మహనీయుడు

- ఎంపీ డీకే అరుణ
- జనాభా ప్రతిపాదికన నిధులు కేటాయించాలి: ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూ టౌన్/పాలమూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ మహనీయుడని, ఆయన వల్లే నేడు దళిత, బడుగు బలహీన వర్గాల వారు రిజర్వేషన్ల ఫలాలతో ఉన్నత స్థానాల్లో ఉన్నారని ఎంపీ డీకే అరుణ అన్నారు. భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. రిజర్వేషన్ల వల్లే బడుగు, బలహీన వర్గాల వారు రాజకీయాల్లో రాణిస్తున్నారని చెప్పారు. రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిద్దామని పిలుపునిచ్చారు.

అంబేడ్కర్ అందరివాడు

బీఆర్ అంబేడ్కర్ అందరివాడని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళా భవన్‌లో 134వ అంబేడ్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ దళిత, బడుగు బలహీన వర్గాల ప్రజలు అందరితో సామన స్థాయికి వచ్చే వరకు రాజ్యాంగంలో ప్రత్యేకమైన వెసలుబాటును కల్పించారన్నారు. జనాభా ప్రాతిపాదికన బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలన్నారు. ఏ వర్గానికి కేటాయించిన నిధులు ఆ వర్గాల అభివృద్ధికే ఖర్చు చేయలన్నారు. జ్ఞానాన్ని సంపాదించుకోవడానికి మీరు ఒక్క అడుగు ముందుకు వేస్తే.. ఇక జీవితంలో మీరు ఎన్నడూ వెనుకడుగు వేయరన్నారు. చదువుకుంటేనే ఉన్నత శిఖరాలకు చేరుకోగలమన్నారు. మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషనల్ హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. అంతకు ముందు అంబేడ్కర్ చౌరస్తాలో బాబాసాహెబ్ విగ్రహానికి పూల మాల వేసి, నివాళి అర్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.వినోద్, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, వకీల్ భీమయ్య, నర్సింహులు, వెంకటేష్, సామ్యూల్, మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి సుదర్శన్ పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం


- ముస్లిం సంఘాల నాయకులు
- మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో భారీ నిరసన ర్యాలీ



తెలంగాణ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ముస్లింలు

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కేంద్రం కొత్తగా తెచ్చిన వక్ఫ్ సవరణల చట్టం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని ముస్లింలు అన్నారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. పాలమూరు అధ్యయన వేదిక, సీపీఎంలు ఈ ర్యాలీకి మద్దతు తెలిపాయి. నగరానికి చెందిన ముస్లింలు అధిక సంఖ్యలో ఊరేగింపుగా క్లాక్‌టవర్, అశోక్ టాకీస్, అంబేడ్కర్ చౌరస్తా మీదుగా తెలంగాణ చౌరస్తాకు చేరుకున్నారు. అక్కడ నల్లా జెండాలు ప్రదర్శిస్తూ, నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలను కాలరాస్తూ.. రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారని అన్నారు. మోదీ వక్ఫ్ సవరణ చట్టం కేవలం ఆదానీ, అంబానీ కోసమే తెచ్చారని ఆరోపించారు. వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు మోసీన్‌ఖాన్, తఖీ హుస్సేన్, ఇద్రీస్, సిరాజ్‌ఖాద్రీ, షబ్బీర్, రాఘవాచారీ, కురుమూర్తి, వామన్‌కుమార్, ఖుద్దుస్‌బేగ్, ఫరూక్ హుస్సేన్, రహెమాన్ పాల్గొన్నారు.

చిరుతల అడ్డా దేవరగుట్ట



దేవరగుట్టపై ఉన్న చిరుత పులి

నవాబ్‌పేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నవాబ్‌పేట మండలం యన్మనగండ్ల గ్రామ దేవరగుట్ట చిరుత పులులకు అడ్డాగా మారింది. మూడు రోజులుగా ఒక చిరుత అక్కడే మకాం వేయడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం, సా యంత్రం వేళ చిరుత ప్రజలకు కనిపిస్తుండటంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. సోమవారం మరోసారి రెండు చిరుతలు కనిపించాయి. ఆదివారం రాత్రి రైతు చెలిమె ఆంజనేయులుకు చెందిన పెంపుడు కుక్కను ఎత్తుకుపోయి, చంపితిన్నాయి. దాంతో తమ పశువులపై ఎప్పుడు దాడి చేస్తాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై అటవీ శాఖ సెక్షన్ అధికారి వెంకటేశ్‌ను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా త్వరలో ఉన్నతాధికారులను సంప్రదించి, బోన్‌లు ఏర్పాటు చేసి చిరుతలను పట్టుకుంటామని తెలిపారు.



జాతరలో అలంకరణ సామగ్రి కొంటున్న మహిళలు

ముగిసిన బావోజీ జాతర



బావోజీని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



జాతరలో గాజులు వేయించుకుంటున్న గిరిజన మహిళలు

కొత్తపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం తిమ్మారెడ్డిపలిలో వెలసిన గురులోక మాసంత్ బావోజీ జాతర సోమవారం ఘనంగా ముగిసింది. నాలుగు రోజుల నుంచి కొనసాగుతున్న ఉత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి గిరిజనులు తరలి వచ్చి, మొక్కులు చెల్లించుకున్నారు. చివరి రోజు కాళికా దేవికి ప్రత్యేక పూజలు చేసి, పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులతో జాతర కిటకిటలాడింది. ప్రసాదాలు, అలంకరణ సామగ్రి కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపారు. జాతర చివరి రోజు కావడంతో వ్యాపారులు ధరలను తగ్గించి విక్రయించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. నారాయణపేట డీఎస్పీ లింగయ్య ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

దర్శించుకున్న ప్రముఖులు

ఉత్సవాల్లో చివరి రోజు బావోజీని మహబూబ్‌నగర్ ఎంపీ అరుణ, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, సత్యవతి రాథోడ్, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, బీజేపీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు సత్యం యాదవ్ దర్శించుకుని పూజలు చేశారు. వారితో పాటు ఉమ్మడి మద్దూరు మండల నాయకులు సలీం, గోపాల్, మధుసూదన్‌రెడ్డి, సూధకర్ రెడ్డి, శంకర్ దర్శించుకున్నారు.



తగ్గని ఎండలు

- గద్వాలకు ఆరెంజ్ అలర్ట్
- ధరూర్‌లో అత్యధికంగా 41 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత
- మహబూబ్‌నగర్‌లో 39 డిగ్రీలు

7

కొత్త టీచర్లు కొత్త సమస్య

వేతనాలు లేవు.. ఐడీ లేదు..

» రెండు నెలలుగా ఎదురు చూపులు
» రెగ్యులర్ ఉపాధ్యాయులుగా గుర్తించాలని వేడుకోలు

నారాయణపేటటౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఆశతో ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన కొత్త ఉపాధ్యాయులకు కొత్త సమస్య వచ్చి పడింది. ఉద్యోగం వచ్చిందన్న సంతోషమే గాని వేతనాలు, ఎంప్లాయ్ ఐడీ ఇప్పటి దాకా వారికి అందకపోవడం గమనార్హం. నారాయణపేట జిల్లాలో డీఎస్సీ -2008. 50 మంది ఉపాధ్యాయులు ఉద్యోగంలో చేరి రెండు నెలలు గడుస్తున్నా జీతాలు రాలేదు. నూతనంగా నియామకమైన ఉపాధ్యాయులకు ఎంప్లాయ్ ఐడీ, ట్రాన్ అకౌంట్ క్రియేట్ చేయడం... పలు సాంకేతిక కారాణాల వల్ల వేతనాలు అందించడంలో జాప్యం జరిగి ఉండవచ్చని సంబంధిత వర్గాలు అంటున్నాయి.

డీఎస్సీ-2008 అభ్యర్థులకు అవకాశం...

నారాయణపేట జిల్లాలో డీఎస్సీ-2008 అభ్యర్థులకు 16 సంవత్సరాలుగా న్యాయ పోరాటం చేస్తూ చివరికి తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు ఫిబ్రవరి 15, 2025న కాంట్రాక్టు పద్ధతిన పోస్టింగ్‌లు ఇచ్చారు. దీంతో ఎస్జీటీలుగా పాఠశాలలో చేరి విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు విద్యా బోధన చేస్తున్నారు. 2024 డీఎస్సీ ఉపాధ్యాయులతో పాటు డీఎస్సీ-2008 కాంట్రాక్టు ఉపాధ్యాయులకు సైతం మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో సైతం పాల్గొన్నారు. 2024 డీఎస్సీ ఉపాధ్యాయుల గుర్తింపు కార్డులతో పాటు వారికి వేతనాలు కూడా వచ్చాయి. 2008 డీఎస్సీ కాంట్రాక్టు ఉపాధ్యాయులకు గుర్తింపు కార్డులు కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలలుగా విధులు నిర్వహిస్తున్నా వేతనాల చెల్లింపులో సాంకేతిక సమస్యలు రావడంతో జీతాలు చెల్లించడంలో జాప్యం జరుగుతున్నదని సంబంధిత అధికారులు అంటున్నారు. వచ్చేది చాలీచాలని జీతం.. సమయానికి రాకపోతే కుటుంబాలు ఎలా పోషించుకోవాలని నూతన ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి త్వరగా జీతాలు చెల్లించాలని కోరుతున్నారు. అదే విధంగా రెగ్యులర్ ఉపాధ్యాయులుగా గుర్తించాలని, దీనికి ఉపాధ్యాయ సంఘాలు కూడా మద్దతు తెలుపాలని డీఎస్సీ -2008కాంట్రాక్టు ఉపాధ్యాయులు కోరుతున్నారు.



డీఎస్సీ-2008 కాంట్రాక్టు ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలని పీఆర్టీయూ ఆధ్వర్యంలో డీఈవోకు వినతి పత్రాన్ని ఇస్తున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, నాయకులు (ఫైల్)

ఉద్యోగ భద్రత లేదు..



మాకు ఉద్యోగ భద్రత లేదు. కనీసం ఉద్యోగ గుర్తింపు కార్డులు కూడా ఇవ్వలేదు. ఉద్యోగం చేస్తూ 2 నెలలు గడిచినా జీతాలు ఇవ్వలేదు. తెలంగాణ ప్రభుత్వం మాకు రెగ్యులర్ జాబ్‌లు ఇచ్చి మమ్మల్ని మా కుటుంబాలను ఆదుకోవాలి. ఉపాధ్యాయ యూనియన్లు కూడా సహకరించాలని కోరుతున్నాం.

- అంకిల్లా రఘునాథ్, ఎంపీపీఎస్ పాతతండా, నారాయణపేట మండలం

ఎంప్లాయ్ ఐడీ కానీ.. జీతాలు కానీ ఇవ్వలేదు



డీఎస్సీ -2008లో భాగంగా 16 సంవత్సరాల తరువాత కోర్టు ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం మాకు కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా నియమించింది. ఫిబ్రవరి 15, 2025న ఉద్యోగంలోకి తీసుకోవడం జరిగింది. కానీ మాకు ఇంత వరకు ఎంప్లాయ్ ఐడీ కానీ జీతాలు కానీ ఇవ్వలేదు. ఇప్పటికే డీఎస్సీ -2008 వాళ్లకు చాలా అన్యాయం జరిగింది. చాలా నష్టపోయాం. టీచర్లుగా గుర్తించి సరియైన న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాం.

- వి.శ్రీనివాస్, ఎస్జీటీ, బండగొండ గ్రామం, నారాయణపేట మండలం

విద్య మరింత చేరువ

5వ పేజీ తరువాయి

చివరి సంవత్సరంలోకి ప్రవేశించే విద్యార్థులకు 'మహబూబ్‌నగర్ స్కిల్స్ ట్రైనింగ్ ఫర్ ఎంప్లాయిమెంట్ రీడీనెస్(మాస్టర్)' కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఎంవీఎస్ డిగ్రీ కాలేజీ, ఎన్టీఆర్ డిగ్రీ కాలేజీ, జడ్చర్ల బీఆర్‌ఆర్ డిగ్రీ కాలేజీ, కొడంగల్ డిగ్రీ కాలేజీలో 2094 మంది విద్యార్థులకు ఇంగ్లీష్, సాఫ్ట్ స్కిల్స్‌లో శిక్షణ అందిస్తారు. త్వరలో ఈ కార్యక్రమం ప్రారంభించనున్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిటీ సీఎస్ఆర్ కింద ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి నిధులను సిద్ధం చేశారని మహబూబ్‌నగర్‌లో ఇటీవల పర్యటించిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ప్రతినిధులు తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్‌ను కూడా ఎమ్మెల్యే సొంతం గా పంపిణీ చేశారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ..

ప్రస్తుతం వరుసగా నోటిఫికేషన్లు విడుదలవుతున్నాయి. ప్రభుత్వం జాబ్ క్యాలండర్ కూడా ప్రకటించింది. డీఎస్సీ, కానిస్టేబుల్, టెట్, ఎస్ఐ తదితర పోస్టుల కోసం సిద్ధంగా ఉండాలంటే పేద అభ్యర్థులకు కష్టం. ఇందులో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో ఈ నెల 16 నుంచి ఈ పరీక్షలకు సంబంధించి ఉచిత శిక్షణ ప్రారంభించనున్నారు. ఇప్పటికే దరఖాస్తు ఫారాలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంచగా.. బుధవారం నుంచి కోచింగ్ ప్రారంభం కానుంది. హైదరాబాద్‌కు చెందిన నిపుణులు శిక్షణ అందించనున్నారు. అలాగే ఎన్టీఆర్ జూనియర్ కాలేజీ, బాయ్స్ కాలేజీలో ఇప్పటికే ఎంసెట్ కోచింగ్ ప్రారంభం కాగా, ప్రస్తుతం 150 మంది విద్యార్థులతో క్రాష్ కోర్సు శిక్షణ ఇస్తున్నారు. అందులో 100 మందికి ఉచితంగా హాస్టల్ వసతి కల్పిస్తున్నారు.

విద్యా'నిధి' సేకరణ..

ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నచిన్న పనులు కావాలంటే చాలా సంవత్సరాలు పడుతుంది. ఈ నేపథ్యంలో కలిసివచ్చిన వారి సహకారంతో చిన్నచిన్న మరమ్మతులను పూర్తి చేసుకోవడంతోపాటు చిన్న మొత్తాల్లో తీసుకునే నిర్ణయాలను వేగంగా అమలు చేయడం కోసం విద్యానిధికి శ్రీకారం చుటారు. విద్యానిధి కింద ఇప్పటివరకు సుమారు రూ.50 లక్షల వరకు జమ అయ్యాయి. రూ.10 కోట్ల సేకరణ లక్ష్యంగా పనిచేస్తున్నారు. అలాగే ఇటీవల మహబూబ్‌నగర్‌లో ని ఇంటర్ కాలేజీల్లో కాస్‌రూములు, టాయిలెట్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. ఒకేషనల్ జూనియర్ కాలేజీలో ఫర్నిచర్, సైన్స్ ల్యాబ్, డ్యూయల్ డెస్క్స్, తరగతి గదుల కోసం రూ.3.10 కోట్లు మంజూరు చేసింది.

లా, ఇంజనీరింగ్, ఏటీసీలు కూడా..

కొన్ని నెలల క్రితం పాలమూరు యూనివర్సిటీకి అనుబంధంగా ఇంజనీరింగ్, లా కాలేజీని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ఏడాది నుంచి అందులో తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈ బడ్జెట్‌లో లా, ఇంజనీరింగ్ కాలేజీల నిర్మాణం కోసం రూ.35 కోట్లు మంజూరు చేసింది. అలాగే మెట్టుగడ్డలోని ఐటీఐని అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేశారు. రూ.75 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో ఆరు జాబ్ గ్యారంటీ కోర్సులకు శిక్షణ ఇవ్వనుండగా, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కాలేజీని దేశ్‌పాండే ఫౌండేషన్ దత్తత తీసుకుని, నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తున్నారు. వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ వద్ద టాస్క్ ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి నియోజకవర్గంలో 25 లర్నింగ్ సెంటర్లు ఏర్పాటు చయనుండగా.. సాయంత్రం మూడు గంటలపాటు విద్యార్థులు తమకు నచ్చిన కోర్సులో శిక్షణ పొందే అవకాశం ఏర్పడనుంది.

బ్యాటరీ దొంగతనం చేసిన వ్యక్తి అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ, ఎస్ఐ

అమరచింత, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా అమరచింత పట్టణానికి చెందిన రవి, ముష్టి రాజశేఖర్ ఆటోలలో బ్యాటరీలు, టేప్ రికార్డర్లు దొంగతనం చేసిన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శివకుమార్, ఎస్ఐ సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో వారు మాట్లాడుతూ... ఈనెల 12వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు రెండు ఆటోలలో బ్యాటరీలు టేప్ రికార్డులను దొంగిలించుకుని వెళ్లిపోయారు. అని వేరు వేరుగా ఇరువురు ఫిర్యాదు ఇవ్వగా అట్టి కేసుల దర్యాప్తులో భాగంగా నిందితుడైన జహంగీర్‌ను పట్టణంలోని భగత్‌సింగ్ విగ్రహం వద్ద వెహికల్ చెకింగ్ చేస్తుండగా పట్టుకుని విచారించగా దొంగతనం చేశానని ఒప్పుకున్నట్లు తెలిపారు. అతని నుంచి మూడు బ్యాటరీలు రెండు టేప్ రికార్డర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి విలువ రూ.24500 ఉంటుందని, అతనిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు.

అంతర్రాష్ట్ర రోడ్డుపై ఆటో బోల్తా

» గర్భిణితో సహా ఆరుగురికి గాయాలు
» పోతులపాడు స్టేజీ సమీపంలో ప్రమాదం



గాయలపాలై రోదిస్తున్న పోతులపాడుకు చెందిన వృద్ధురాలు సాలీబు.

అలంపూరుచౌరస్తా, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని కలుగొట్ల గ్రామ శివారులో అంతర్రాష్ట్ర రహదారిపై ప్రయాణిస్తున్న ఆటో సోమవారం బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న ఆరుగురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. అలంపూరుకు చెందిన ఓ ఆటో చెన్నిపాడు గ్రామం నుంచి అలంపూరు చౌరస్తావైపు నలుగురు ప్రయాణికులతో బయలుదేరింది. పోతులపాడు గ్రామంలో ఓ గర్భిణీతో పాటు 60ఏళ్ల వృద్ధురాలు ఎక్కారు. అంతర్రాష్ట్ర రహదారిపై వెళుతున్న ఈ ఆటో రోడ్డుపై ఉన్న గుంతలో ముందు చక్రం పడటంతో ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డుకి కిందివైపు పల్టీలు కొట్టుకుంటూ బోల్తాపడింది. దీంతో ఆటోలో ఉన్న జయమ్మ, రమణమ్మ, ఖాజా బాషా, చాకలి పరశురాముడు, హుస్సేన్‌బీ, సాలీబులకు తీవ్ర గాయలయ్యాయి. వీరిని 108 అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వారు చికిత్స పొందుతున్నారు. రోడ్డు గుంతలమయంగా ఉండటం, డ్రైవర్ అజాగ్రత్తతోనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

అర్ధరాత్రి మంత్రాలతో బాబాల హల్‌చల్



రోడ్డుపై మంత్రాలు జరిపిన ప్రాంతం ఇదే..

గోపాల్‌పేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలో దొంగ బాబాలు అర్ధరాత్రి సమయంలో హల్‌చల్ చేశారు. స్థానికు లు తెలిపిన వివరాలు ప్రకారం.. మండల కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి బస వన్న గుడి సమీపంలో మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి తనకు అనారోగ్యం గా ఉందంటూ ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఇద్దరు బాబాలతో నడిరోడ్డుపైన పసుపు కుంకుమలతో కలిపిన ముగ్గు వేసి పూజలు ప్రారంభించారు. ఇంటి పక్కల ఉన్న సదరు వ్యక్తి వచ్చి కేకలు వేయడంతో అక్కడి నుంచి ము గ్గురు పారిపోయారు. ఉదయాన్నే గ్రామస్థులు వేసిన ముగ్గును పసుపు కుంకు మతో కలిపిన అన్నాన్ని మంట పెట్టి కాల్చివేశారు. మండల కేంద్రంలోని చంద్రన్న గడ్డ కాలనీలో కూడా కార్యక్రమాలు జరుగుతున్నాయని కాలనీవాసులు తెలిపారు ఇలాంటి బురిడీ బాబాలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ప్రజ లు కోరుతున్నారు.

నీట మునిగి ఒకరి మృతి

● మరో నలుగురు గల్లంతు

5వ పేజీ తరువాయి

నీటిలో ఈతకు వెళ్లారు. ముగ్గురు యువకులు నీటిలోకి దిగగా ఇద్దరు ఒడ్డున ఉన్నారు. నీటిలోకి దిగిన ముగ్గురిలో విజయ్(27) అనే యువకుడికి ఈత రాగా, మిగతా ఇద్దరు మహమూద్(24), అయ్యప్ప(17)లకు ఈతరాదు. కొంతదూరం వెళ్లి ఈత కొట్టాలని అనుకున్నారు. అయితే లోతు ఎక్కువగా ఉండటంతో ఈతరాని ఇద్దరు లోపలికి వెళ్లి మునుగుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన విజయ్ వారిని బయటకు లాగేందుకు ప్రయత్నించగా వారు అతని గొంతు, కాళ్ళు పట్టుకోవడంతో వారితో పాటు మునిగాడు. వారి నుంచి విడిపించుకొని బయటకు వచ్చే ప్రయత్నం చేయగా అప్పటికే నీళ్ళు మింగడంతో ఆయాసంగా ఒడ్డుకువచ్చి ప్రాణాలొదిలాడు. మిగతా ఇద్దరు మాత్రం గల్లంతయ్యారు. ఈ విషయాన్ని గమనించి బయటే ఉన్న ఇద్దరు భయంతో అక్కడి నుంచి పరుగులు తీసి కాలనీ వాళ్ళకు విషయం చెప్పడంతో బాధిత కుటుంబ సభ్యులతో పాటు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. నీట మునిగిన వారికోసం చాలాసేపు వెతికినా ఆచూకీ లభించలేదు. విసయం తెలుసుకున్న రూరల్ ఎస్సై విజయ్‌కుమార్ తన సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకున్నారు. క్వారీ ఎకరా పొలంలో విస్తరించి ఉండటం అందులో దాదాపు 20 నుంచి 25 అడుగుల లోతులో నీరు ఉండటంతో గల్లంతైన వారిని వెలికితీయడం కష్టంగా మారింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది నీటిని తోడే ప్రయత్నం చేస్తూనే బోటు సాయంతో నీటిలోకి వెళ్ళి పాతాళ గడి వేస్తూ గల్లంతైన వారికోసం వెతుకున్నారు. గజ ఈతగాళ్ళతోనూ వెతికించారు. రాత్రి పొద్దుపోయే వరకు కూడా వారి ఆచూకీ లభించకపోవడం, చీకటి పడటంతో రెస్క్యూకు అంతరాయం ఏర్పడింది. భారీ ఫోకస్ లైట్లు వెలుతురులో వెతికే ప్రయత్నం చేస్తున్నారు. మృతుల్లో విజయ్ వెల్డింగ్ పనిచేస్తుండగా, మిగతా ఇద్దరు ప్రైవేట్ మాల్‌లో పనిచేస్తున్నారు. వీరిలో అయ్యప్ప ఇటీవలే మొదటి సంవత్సరం ఒకేషనల్ పరీక్షలు రాశాడు. విషయం తెలుసుకున్న దివిటిపల్లి గ్రామస్థులు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళ సముదాయవాసులు పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నారు. కాలనీలో ముగ్గురు యువకులు మృత్యువాత పడటంతో కాలనీలో విషాదచాయలు అలుముకున్నాయి. చేతికి వచ్చిన కొడుకులు ఇలా అర్ధంతరంగా చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతుల్లో ఎవరికి కూడా పెళ్ళి కాలేదు. విజయ్ మృతదేహాన్ని జనరల్ ఆసుపత్రి మార్చ్యూరికి తరలించారు.



క్వారీ వద్దకు చేరిన ప్రజలు



విజయ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

నిర్లక్ష్యంగా క్వారీని వదిలేయడంపై విమర్శలు

ప్రభుత్వ మెడికల్ కళాశాల పక్కనే క్వారీ ఉన్నది. గతంలో కళాశాల నిర్మాణం కోసం కాంట్రాక్టర్ ఇక్కడ భారీ క్వారీ తవ్వారు. ఎకరాపొలంలో క్వారీ తవ్వడం లోతు కూడా ఎక్కుగా ఉండటంతో ఊట కారణంగా ఎప్పుడూ ఇందులో చెరువును తలపించేలా నీరు ఉంటుంది. ఐదేళ్ళ క్రితం క్వారీ తవ్విన కొత్తలో ఇందులో పడి ఇద్దరు యువకులు చనిపోయారు. మళ్ళీ అందులోనే ముగ్గురు యువకులు ప్రమాదానికి గురికావడంతో అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చెరువులో పడి ఇద్దరు..

బాలానగర్, (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల పరిధిలోని గంగాదరపల్లి గ్రామ పంచాయితీకి చెందిన శివరాములు (45), యాదగిరి (35) గ్రామ సమీపంలోని పెద్ద చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం ఉదయం చెరువులో పడిన మృతుల వవాలను బయటికి తీస్తే పూర్తి సమాచారం వెల్లడించే అవకాశం ఉంటుందని పే ర్కొన్నారు.

ప్రమాదానికి ఎవరూ కూడా ఫిర్యాదు చేయలేదని, సంఘ టన స్థలం బంధువుల రోదనలతో హృదయ విదారకంగా ఉందని, పూర్తి సమాచారం ఉదయం 10 గంటలకు వచ్చే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు.

రెక్కాడితేనే డొక్కాడుతుంది

» మృతుల కుటుంబాలది కడుపేదరికం

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతుండటంతో సరదాగా ఈతకు వెళ్లిన ముగ్గురు యువకులు క్వారీలో మునిగి గల్లంతయ్యారు.. ఇందులో ఒక మృతదేహం బయటపడగా మిగతా ఇద్దరికోసం గాలిస్తున్నారు. దివిటిపల్లి డబుల్‌బెడ్‌రూమ్ సముదాయంలో నివాసం ఉంటున్న విజయ్‌కుమార్(27), ఎండీ మహమూద్(24), అయ్యప్ప(17)లు సోమవారం దివిటిపల్లి సమీపంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల పక్కనే ఉన్న క్వారీలో ఈతకు వెళ్లి మృత్యువాతపడ్డారు. చనిపోయిన ముగ్గురు కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉంది. వీళ్ల పనిచేస్తేనే కుటుంబాలు గడిచే పరిస్థితి ఉండటం, చేతికందిన పిల్లలు అర్ధాంతరంగా తనువు చాలించడంతో ఆ కుటుంబాలలో తీవ్ర విషాదాన్ని నింపింది. కుటుంబ పోషణలు విజయ్, మహమూద్‌లకు ఇంకా పెళ్లికాలేదు. అయ్యప్ప మాత్రం ఇటీవలే ఇంటర్ ఒకేషినల్ పరీక్షలు రాశాడు. మహమూద్ తల్లిదండ్రులు ఇద్దరూ గతంలో చనిపోయారు. వీళ్ల ఐదుగురు అన్నదమ్ములు కాగా, పెద్దన్న చనిపోవడంతో వదిన దగ్గరే ఉంటున్నాడు. హనుమాన్‌పుర డిస్టలరీలో అద్దెకుంటున్న వీరికి డబుల్‌బెడ్‌రూమ్ కేటాయించడంతో అక్కడే నివాసముంటున్నారు. ప్రైవేట్ మాల్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండ్రోజులుగా లోన్‌కోసం తిరుగుతూ ఇంటి వద్ద ఉంటూ ఈతకు వెళ్లాడు. ఇక విజయ్‌కుమార్‌కు ముగ్గురు అన్నదమ్ములు. తండ్రి మరణించగా తల్లి ఇంట్లోనే ఉంటుంది. ముగ్గురు కొడుకులలో పెద్దకుమారుడు జడ్చర్ల కొకకోల కంపెనీలో రోజువారి కూలీగా పనిచేస్తుండగా, రెండో కుమారుడు కిరాణంలో పనిచేస్తాడు. మృతుడు విజయ్‌కుమార్ వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. రెండో అన్న భార్య పేరిట డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లు వచ్చింది.

ఇక మరో మృతుడు అయ్యప్ప ఇటీవలే ఇంటర్ ఒకేషనల్ పరీక్షలు రాశాడు. తండ్రి పెట్రోల్ బంక్‌లో పనిచేస్తూ అమర్‌రాజా లో సెక్యూరిటీగా పనిచేస్తుండగా, ఈయనకు కూతురు, కొడుకు ఉండగా ఇప్పుడు ఒక్క కొడు కు చనిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు.



ఇంటిముందు రోదిస్తున్న మహమూద్ కుటుంబ సభ్యులు

చౌడేశ్వరి మాతా.. సల్లంగా చూడమ్మా..



పొట్టేళ్ల బండిపై స్వారీ చేస్తున్న నిరంజన్‌రెడ్డి

గోపాల్‌పేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): చాముండేశ్వరి మాతా.. రాష్ట్ర ప్రజలను సల్లంగా చూడమ్మా అని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి వేడుకున్నారు. సోమవారం వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని చెన్నారంలో చౌడేశ్వరి దేవత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. చౌడేశ్వరి మాత ఆలయం చుట్టూ జరుగుతున్న ఎద్దులు, ట్రాక్టర్లు, పొట్టేళ్ల మండ్ల ప్రదర్శన ప్రారంభించారు. పొట్టేళ్ల బండిపై స్వారీ చేసి గ్రామస్థులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామ ప్రజలు ఐక్యమత్యంతో భక్తి ప్రపతులతో పండుగ జరుపుకోవాలని, చౌడేశ్వరి దేవత ఆశీస్సులు నియోజకవర్గంపైన, తెలంగాణపైన ఉండాలని ఆకాంక్షించారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, మాజీ సర్పంచ్ రమేష్, నాయకులు స్వామి, ఆశన్న, చిన్నయ్య, మల్లయ్య, శ్రీశైలం, సంజీవ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార కేసులో నిందితుడిపై పోక్సో కేసు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): లిఫ్ట్ ఇస్తానని మైనర్ బాలికను ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని వెళ్లిన యువకుడు మార్గమధ్యంలో బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన కేసులో పోలీసులు పోక్సో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన బాలిక మహబూబ్‌నగర్ మండలంలోని ఓ గ్రామంలో ఉంటున్న తన సోదరి ఇంటికి ఆదివారం వస్తున్నది. ఈ సందర్భంలో ఎస్వీఎస్ ఆసుపత్రి వద్ద తన సోదరి గ్రామానికి చెందిన యువకుడు తను ఊరికే వెళ్తున్నానని లిఫ్ట్ ఇస్తానని ఎక్కించుకున్నాడు. బొక్కలోనిపల్లి వద్దకు రాగానే దారి మళ్లించి వాహనాన్ని నిర్మానుష్యప్రాంతంలో ఆపి యువతిపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. దీంతో ఆమె తప్పించుకుని స్థానికుల సాయంతో బయటపడింది. బాధితురాలి ఫిర్యాదుమేరకు రూరల్ పోలీసులు పోక్సో కేసు నమోదుచేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు. మరోవైపు బాలికకు జనరల్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించారు.

హిల్ పార్క్ రెస్టారెంట్ కూల్చివేతపై పోలీసులకు ఫిర్యాదు

బాలానగర్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదాని పక్కనే ఉన్న హిల్ పార్క్ రెస్టారెంట్ ముందు భాగాన్ని భాస్కర్ అనే వ్యక్తి కూల్చివేసినట్లు రెస్టారెంట్ యజమాని సయ్యద్ జావిద్ అలీ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. రెస్టారెంట్ పక్కన ఉన్న స్థలాన్ని 2003 సంవత్సరంలో యూసఫ్ అలీ అనే వ్యక్తి భాస్కర్‌కు విక్రయించాడు. అయితే సయ్యద్ జావిద్ అలీకి చెందిన హిల్ పార్క్ రెస్టారెంట్‌ను భాస్కర్ తనదేనంటూ పేర్కొంటూ ఆదివారం రాత్రి అతడి అనుచరులు రెస్టారెంట్ సెక్యూరిటీ గార్డు జంగయ్యను, హోటల్‌లో పని చేసే సిబ్బందిని బెదిరించారు. వారి సెల్ ఫోన్లను గుంజుకొని, ఎక్స్‌కవేటర్‌తో రెస్టారెంట్ ముందు భాగాన్ని ధ్వంసం చేశారు. ఖరీదైన ఫర్నీచర్, కరెంట్ రీచార్జీ మిషన్, సీసీ కెమెరాలు ధ్వంసం అయినట్లు జావిద్ అలీ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లెనిన్ వెల్లడించారు.

అకాల వర్షం

మిడ్జిల్/దేవరకద్ర/దోమలపెంట/మహబూబ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలుచోట్ల సోమవారం సాయంత్రం వర్షం కురిసింది. దీంతో అక్కడక్కడ ధాన్యం తడిసింది. మహబూబ్‌నగర్ జిల్లా పాలమూరు రూరల్ మండలం ఓబులాయపల్లి, కోటకదిర గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షానికి ధాన్యం తడిసిపోయింది. మన్యంకొండ దేవస్థానం ప్రధాన ఆర్చి నుంచి గుట్టవరకు దాదాపు 25 మంది రైతులు ధాన్యం ఆరబెట్టగా వడగళ్ల వర్షం పడటంతో నీటిలో కొట్టుకుపోయింది. భారీగా ఈదురు గాలులు వీయడంతో రైతులు టార్పాలిన్ కవర్లు కప్పాలని ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఓబులాయపల్లి, కోటకదిర, రాంచంద్రపూర్, ఓబులాయపల్లి తండా, కోడూరు, అప్పాయిపల్లితో పాటు పలు గ్రామాల్లో చేతికి వచ్చిన వరి పంట నేలవాలింది. మన్యంకొండ పరిసర ప్రాంతాల్లోని తోటల్లో మామిడి కాయలు నెలరాలాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి రైతులను పరామర్శించారు. నష్టాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానన్నారు. మాజీ జడ్పీటీసీ పుల్లూరు రవీందర్ రెడ్డి, కోటకదిర మాజీ సర్పంచ్ మల్లు దేవేందర్‌రెడ్డి రైతులను పరామర్శించి, ఆదుకోవాలని కోరారు. దేవరకద్ర మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వర్షంతో ధాన్యం తడిసింది. మిడ్జిల్ మండలంలో వర్షానికి పొలాల్లో ధాన్యం నేలరాలింది. అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన రైతు నర్సింహారెడ్డి 7 ఎకరాల వ్యవసాయ పొలంతో పాటు పలువురి పంటలు దెబ్బతిన్నాయి. వెలుగొమ్ముల గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్ స్తంభాలు, అయ్యవారిపల్లి గ్రామంలోని విద్యుత్ స్తంభాలు నెలకొరగడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మండలంలోని చిల్వేరు, అయ్యవారిపల్లి, వెలుగొమ్ముల, కొత్తూరు గ్రామాల శివారులతో పాటు పలు గ్రామాల్లో ఈదరుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. దీంతో 150 ఎకరాలకు పైగా పంట నష్టపోయినట్లు ప లు గ్రామాల రైతులు తెలిపారు. నాగర్‌కర్నూలు జిల్లా దోమలపెంట పరిధిలోని వటువర్లపల్లి, కుడిచింతలబావి, సార్లపల్లి, మల్లెలతీర్థం, కొల్లం, కొమ్మనపెంట గ్రామాల పరిసర అటవీ ప్రాంతంలో వర్షం కురిసింది.



వటువర్లపల్లిలో కురిసిన వర్షం

క్రైం కార్నర్

టైర్ పంక్చర్ షాప్ డబ్బా దగ్ధం

» రూ.70 వేల ఆస్తి నష్టం



అమరచింతలో కాలి బూడిదైన సైకిల్, పంక్చర్ దుకాణం

అమరచింత, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు టైర్ పంక్చర్, సైకిల్ మెకానిక్ డబ్బా మంటల్లో దగ్ధం కావడంతో 70వేల ఆస్తి నష్టం సంభవించిందని యజమాని పేర్కొన్నారు. వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌక్‌లో అనేక సంవత్సరాలుగా కమురుద్దీన్ అనే వ్యక్తి టైర్ పంక్చర్, సైకిల్ మెకానిక్ సంబంధించిన డబ్బాలో పెట్టుకుని జీవనం కొనసాగిస్తున్నాడు. ప్రధాన రహదారి పక్కన రెండు చెక్క డబ్బాల్లో టైర్లు, ఎయిర్ పంపు, ట్యూబ్‌లు, కొత్త సైకిళ్లు, రిమ్ములు, బైక్, సైకిల్‌కు సంబంధించిన తదితర వస్తువులను పెట్టుకొని తన వ్యాపారాన్ని కొనసాగి స్తున్నాడు. సోమవారం తెల్లవారు జామున ఆ దుకాణం పక్కనే కాలనీ వాసులు వేసిన చెత్తకు కొంతమంది మంట పెట్టారు. అక్కడ చెలరేగిన మంట కాస్త వ్యాపించి ఆ డబ్బాలకు అంటుకుంది. దీంతో ఒక డబ్బా అం దులో ఉన్న సైకిళ్లు, టైర్లు, ట్యూబులు, సామగ్రి మొత్తం మంటలో ఖాళీ బూడిదయ్యాయి. దీంతో 30వేల ఫైచిలుకుతో చేయించిన డబ్బాతో పాటు అందులో ఉన్న సైకిళ్లు, సామగ్రి మొత్తం కాలిపోయి 70వేలకు పైగా ఆస్తి నష్టం సంభవించిందని దుకాణ యజమాని కమురుద్దీన్ పేర్కొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవాబ్‌పేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): భార్యపై అలక వహించిన ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విక్రం కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మహ్మద్ తాజ్(30) గత మూడు సంవత్సరాల క్రితం రంగారెడ్డి జిల్లా షాబాద్‌కు చెందిన ఐషాను వివాహం చేసుకున్నాడు. పెళ్లయిన ఆరు నెలల తర్వాత వేరే వ్యక్తితో ఐషా వెళ్లి పోవడంతో తాగుడుకు బానిసైన ఆయన సోమవారం ఉదయం ఆరు గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన అన్న మహ్మద్ సదీర్ ఘటన స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రం తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లి రాలేదని..

భర్త ఆత్మహత్యాయత్నం



పెబ్బేరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆంజనేయులు

పెబ్బేరు రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో జరిగిన ఓ చిన్న గొడవకు భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. మూడు నెలలు అవుతున్నా భర్త దగ్గరకు రాకపోవడంతో అతడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన సోమవారం వనపర్తి జిల్లాలో చోటుచేసుకుంది.

పెబ్బేరు మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన కదిరె లక్ష్మయ్య-లక్ష్మి దంపతుల కుమారుడు ఆంజనేయులు కంచిరావుపల్లి గ్రామంలో విద్యుత్తు బస్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. పాన్‌గల్ మండలం శాఖపురం గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ తిరుపతయ్యకు మార్తె లక్ష్మికల్యాణితో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వనపర్తి పట్టణ కేంద్రంలోనే నివాసం ఉంటున్నాడు. కొద్దిరోజులుగా సాఫీగా సాగిన వీరి జీవితంలో గొడవలు మొదలయ్యాయి. చిన్న గొడవతో అది చిలికి చిలికి గాలి వానల మారింది. భర్తతో గొడవ పడి పుట్టింటికి వెళ్లిపోయింది. మూడు నెలలుగా భార్య పుట్టింటి దగ్గరనే ఉండగా తనదగ్గరకు రావాలని కోరినా భార్య రాలేనని చెప్పేసింది. దీంతో భార్య వదిలేసి వెళ్లిందని తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. భార్య దగ్గర లేక, ఇటు ఆలోచనలతో జీవితం గడపలేకపోయాడు. చావే శరణ్యమని భావించి సబ్‌స్టేషన్‌లో విధులు ముగించుకొని ఇంటికి వెళ్లకుండా పెబ్బేరులో ఓ షాపులో పురుగుల మందు డబ్బాను కొనుగోలు చేశాడు. రంగాపురం గ్రామం పక్కన ఓ చెట్టు కింద కూర్చొని ఆత్మహత్య చేసుకుంటున్నానని పురుగులమందు తాగుతూ వీడియోతీసి.. అతని గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో వేశాడు. ఈ విషయమై గ్రామస్థులు పెబ్బేరు పో లీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆ యువకుడి ఫోన్‌లొకేష న్ ద్వారా తెలుసుకొని అతని దగ్గరకు వెళ్లారు. పురుగుల మందును కొద్దిగా తాగి పక్కనే డబ్బా ఉండగా, అతన్ని పట్టుకొని పెబ్బేరు ప్రభుత్వ ఆస్పత్రి లో చికిత్స చేయించారు. అనంతరం అతని కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆ స్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు ఆ యువకుడిని రక్షించడంతో ఎస్సై యు గేందర్‌రెడ్డి, పోలీస్ కానిస్టేబుల్ వెంకట్రాములు, ఓంగార్డు రామన్‌గౌడును ప్రజలు అభినందించారు. ఈ సంఘటనపై యువకుడి కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళితే ఫిర్యాదు తీసుకోవడం లేదని తెలిపారు. ఈ సంఘటపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై యుగేందర్ రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వెల్దండ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రం సమీపంలోని హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మహబూబ్‌నగర్‌కు చెందిన రాజ్‌గోపాల్ సింగ్(45) మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే... స్థానికంగా ఉన్న కేఎల్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో రాత్రి ఓ శుభకార్యానికి హాజరైన రాజ్‌గోపాల్‌సింగ్ రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి నలుగురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు.

పాముకాటుకు రైతు..

వంగూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని డిండి చింతపల్లి గ్రామానికి చెందిన ఇందుర్తి శ్రీనివాస్ రెడ్డి(50) అనే రైతు సోమవారం పాముకాటుకు గురై మృతి చెందాడు. వ్యవసాయ పొలంలో గడ్డివాము కోస్తుండగా, అందులో ఉన్న పాము కాటేసింది. దీంతో ఆయన అపస్మారకస్థితికి చేరుకున్నాడు. గమనించిన పక్క పొలం రైతులు నోటి నుంచి నురగలు రావడంతో ఆయనను ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తుండగానే అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.



శ్రీనివాస్‌రెడ్డి(ఫైల్)

పిడుగుపాటుతో వ్యక్తికి గాయాలు

వెల్దండ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని బండోనిపల్లి గ్రామానికి చెందిన వావిళ్ల పర్వతాలు అనే వ్యక్తి సోమవారం పిడుగుపాటుకు గాయపడ్డాడు. సాయంత్రం ఈదురుగాలులు, వర్షం పడుతుండటంతో వ్యవసాయ పొలం వద్ద ఉన్న పర్వతాలు చెట్టుకిందకు వెళ్లడంతో పిడుగుపడింది. దీంతో పర్వతాలు గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అనుమానాస్పదం

జిల్లాలో పెరుగుతున్న మృతులు

» ట్రాన్స్‌జెండర్‌లే కారణమంటూ ఆరోపణలు

» దౌర్జన్య వసూళ్లకు కళ్లెం వేసిన పోలీసులు



దౌర్జన్యపు వసూళ్లకు పాల్పడవద్దని ట్రాన్స్‌జెండర్లకు హెచ్చరిస్తున్న సీఐ టంగుటూరి శ్రీను(ఫైల్)

గద్వాల క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో గత కొంతకాలంగా అనుమానాస్పద స్థితిలో మృతి చెందుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. ఇందుకు జిల్లాలో రెండు అనుమానాస్పద మృతులే కారణాలుగా చెప్పవచ్చు. అయితే అవి అనుమానాస్పద మృతులు అయినప్పటికీ ఈ రెండింటికి ట్రాన్స్‌జెండర్లే కారణంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సంఘటనలు ఇలా..

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని చింతలపేటకు చెందిన నవీన్ అనే యువకుడు పురుగుమందు సేవించి ఈ ఏడాది ఫిబ్రవరి 6న చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. మొదట ఆ కేసు అనుమానాస్పదంగా ఉన్నప్పటికీ నవీన్ చికిత్స పొందే సమయంలో తాను కడుపునొప్పి తాళలేకే ఆత్మహత్య చేసుకుంటున్నానని ఆసుపత్రి వర్గాలకు సమాచారం ఇచ్చాడు. అయితే నవీన్ మృతికి ట్రాన్స్‌జెండర్ పల్లవి కారణమని ప్రజలు, కుటుంబ సభ్యులు ఆరోపించిన విషయం తెలిసిందే. అయితే నవీన్, పల్లవి అప్పటికే ఇద్దరు పెళ్లి చేసుకున్నట్లు తర్వాత వీడియోలు బయటకు వచ్చాయి. ఈ కేసు పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ విచారణ చేస్తున్న తెలుస్తున్నది. అలాగే ఇటీవలే గత రెండు రోజుల క్రితం మల్దకల్ మండల కేంద్రానికి చెందిన రామకృష్ణ మృతికి కూడా శివాని అనే ట్రాన్స్‌జెండర్ అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రామకృష్ణ గత కాలంగా శివానితో సన్నిహితంగా ఉంటూ కొద్ది రోజుల నుంచి మాట్లాడకపోవడంతో తన భర్తను ట్రాన్స్‌జెండర్‌తో పాటు మరోముగ్గురు కలిసి హతమార్చారని రామకృష్ణ భార్య కృష్ణవేణితో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు నవీన్, రామకృష్ణ మృతి కేసులు జిల్లాలో చర్చనీయాంశంగా మారుతున్నాయి. అయితే ఈ ఇద్దరు యువకులు ట్రాన్స్‌జెండర్లతో దిగిన ఫోటోలు, వీడియోలు జిల్లాలో వైరల్‌గా మారాయి.



అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన గద్వాలకు చెందిన నవీన్(ఫైల్)



అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన రామకృష్ణ(ఫైల్)

దౌర్జన్యపు వసూళ్లు.. కళ్లెం వేసిన పోలీసులు

జోగుళాంబ గద్వాల జిల్లాలో కేవలం గద్వాలకు చెందిన ట్రాన్స్‌జెండర్లతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాలైన కర్నూల్, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా ఇక్కడ వచ్చి దౌర్జన్యంగా వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదైనా గృహప్రవేశాలకు, శుభకార్యాలకు వచ్చి వారు అడిగినంత డబ్బులు ఇవ్వకపోతే దౌర్జన్యం చేస్తున్నట్లు తెలుస్తున్నది. గతంలో దౌర్జన్య వసూళ్లపై కొందరు పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలుస్తున్నది. వీరు ముఖ్యంగా పట్టణ శివారులో స్పీడ్‌బ్రేకర్ల దగ్గర ఉంటూ దౌర్జన్యంగా వసూళ్లకు పాల్పడుతూ వాహనదారులను ఇబ్బందులు పెడుతున్నట్లు తెలుస్తున్నది. అలాగే కొన్ని శుభకార్యాల దగ్గర పనికట్టుకొని వచ్చి దౌర్జన్యాలకు పాల్పడుతుండటం గమనార్హం. అయితే ఇటీవలే గద్వాల సీఐ టంగుటూరి శ్రీను జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లను పిలిపించి దౌర్జన్యంగా వసూలు చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆ తర్వాత కొద్దిమోతాదులో దౌర్జన్యపు వసూళ్ల కొంతకాలంగా తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తున్నది. అయితే పోలీసులకు తెలియకుండా మళ్లీ వారి రూటులోనే వెళ్తున్నట్లు బాధితులు తెలుపుతున్నారు.

ట్రాన్స్‌జెండర్ల చర్యలపై నిఘా ముమ్మరం చేశాం



జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ట్రాన్స్‌జెండర్ల చర్యలపై నిఘా ముమ్మరం చేశాం. ఇటీవలే దౌర్జన్యపు వసూళ్లు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడం జరిగింది. అయితే అనుమానాస్పద మృతులపై పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటాం. ఇందులో ఎవరినీ ఉపేక్షించేది లేదు. ఇటీవలే రామకృష్ణ మృతికి సంబంధించిన అనుమానితులను త్వరలోనే పట్టుకొని విచారిస్తాం. బాధ్యులపై చట్టరీత్యా చ ర్యలు తీసుకొని వారికి శిక్ష పడేలా చేసేందుకు పోలీస్ వ్యవస్థ ఉన్నది.

- టంగుటూరి శ్రీను, సీఐ, గద్వాల.

తగ్గని ఎండలు.. గద్వాలకు ఆరెంజ్ అలర్ట్



ఎండ తీవ్రతకు జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద నిర్మానుష్యంగా ప్రధాన రహదారి

గద్వాల/నారాయణపేట/వనపర్తి అర్బన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎండల తీవ్రత పెరుగుతోంది. జోగుళాంబ గద్వాల జిల్లా ఆరెంజ్ జోన్‌లోకి జిల్లా మారుతున్నది. సోమవారం ధరూర్‌లో 41 డిగ్రీలు అత్యధికంగా నమోదు కాగా గట్టు, ఇటిక్యాల, ఆలంపూర్‌లలో 40.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మల్దకల్‌లో 40.8, కేటీదొడ్డిలో 40.6, గద్వాలలో 40.5, అయిజలో 40.4 డిగ్రీలుగా నమోదైంది. కనిష్ఠ ఉష్ణోగ్రత 23.7 డిగ్రీలు నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠం 39, కనిష్ఠం 25.1 డిగ్రీలు నమోదైంది. నారాయణపేట జిల్లాలో గరిష్ఠంగా 37 డిగ్రీలు, కనిష్ఠంగా 26 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో గరిష్ఠంగా 37 డిగ్రీలు, కనిష్ఠంగా 24 డిగ్రీలు నమోదైంది. వనపర్తి జిల్లావ్యాప్తంగా ఎండ తీవ్రత పెరిగింది. గత రెండు రోజుల నుంచి 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదవుతున్నది. అత్యధికంగా కొత్తకోట మండలంలో 41.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అత్యల్పంగా పీపనగండ్ల మండలంలో 38.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

డేంజర్ జోన్ వరకు వెంటిలేషన్ పునరుద్ధరణ

» ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి

» మిగిలిన 70 మీటర్లలో 50 మీటర్లకు శిథిలాలు తిరుగతోడిన రెస్క్యూ బృందాలు

» ఆ ఆరుగురి ఆచూకీ 20 మీటర్లలో ఉండొచ్చా..?

» ప్రభుత్వం విధించిన గడువు వరకు శిథిలాల తొలగింపు చర్యలు



సొరంగంలో డేంజర్ జోన్‌లో బోర్డు ఏర్పాటు చేస్తున్న రెస్క్యూ సిబ్బంది

దోమలపెంట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో డేంజర్ జోన్ ఏరియా సమీపం వరకు వెంటిలేషన్ వ్యవస్థను పునరుద్ధరణ చేపటినట్లు ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రత్యేకాధికారి శివ శంకర్ లోతేటి తెలిపారు. సొరంగ ప్రమాద దుర్ఘటన జరిగి సోమవారానికి 52 రోజులు కావడంతో శిథిలాల కింద చిక్కుకున్న ఆరుగురి కార్మికుల మృతదేహాలను వెలికి తీసెందుకు రెస్క్యూ బృందాలు అన్వేషణ కొనసాగుతుందన్నారు. ప్రమాద ఘటన జరిగిన నాటి నుంచి నేటి వరకు రెస్క్యూ బృందాల సహాయక చర్యల్లో పాల్గొంటూ నిత్యం తవ్వకాలు చేడుతున్నారు. శిథిలాల తొలగింపు పనులు జరుగుతున్న ప్రాంతం వరకు అవసరమైన ఆక్సిజన్ అందించేందుకు వెంటిలేషన్ వ్యవస్థను పొడిగించడంతో పాటు, 5 ఎక్స్‌కవేటర్ల ద్వారా బురద మట్టిని తవ్వి కన్వేయర్ బెల్ట్‌పై బయటకు పంపడం జరుగుతుంది. బండరాళ్లనూ, టీబీఎం మిషన్ శకలాలను కత్తిరించి లోకో ట్రైన్‌లో తరలించడం, నీటి ఊటను ఎప్పటికప్పుడు 5 మోటారు పంపులతో నదిలోకి పంపనున్నట్లు తెలిపారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద రెస్క్యూ బృందాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి సొరంగంలో జరుగుతున్న పనుల పురోగతిపై అధికారులతో చర్చించి వివరాలు తెలుసుకున్నారు. సహాయక చర్యల్లో పాల్గొనే సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు తెలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సహాయక చర్యల్లో సింగరేణి జీఎం డీ బైద్య, రెస్క్యూ టీం మేనేజర్లు రాజేందర్ రెడ్డి, మాధవరావు, ఎన్‌డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా, రైల్వే అధికారి రవీంద్ర నాథ్ జీఎస్ఐ, ఇరిగేషన్, జేపీ కంపెనీ ప్రాజెక్టు సీనియర్ ఇంజనీర్ సంజయ్‌కుమార్ సింగ్ వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.



శిథిలాలే తొలగిస్తున్న దృశ్యం

నేడు శిథిలాలను పూర్తిగా తిరగతోడనున్న రెస్క్యూ సిబ్బంది

ప్రస్తుతం మిగిలిన 70 మీటర్ల శిథిలాల్లో 20 మీటర్ల వరకు పూర్తిగా అడుగు భాగం వరకు మట్టి బురద, ఇనుప శకలాలను తొలగించారు. మిగిలిన 50 మీటర్లలో ఆ ఆరుగురి ఆచూకీ ఏమైనా లభిస్తుందా.. అనే కోణంలో రెస్క్యూ బృందాలు శ్రమిస్తూ శనివారం రాత్రి వరకు 30 మీటర్ల దూరం శిథిలాలను తిరుగతోడారు. ఒక పక్క సాధ్యమైనంత వరకు శిథిలాలను బయటకు తరలిస్తూనే, మరోపక్క అణువనువునా రెస్క్యూ బృందాలు తవ్వకాలు చేపడుతూ ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం 20 మీటర్ల వరకు శిథిలాల పెకిలింపు మిగిలిఉన్నది. మంగళవారం వరకు ఇక్కడ కూడా శిథిలాలను తిరుగతోడే పనుల్లో రెస్క్యూ బృందాలు నిమగ్నం అయ్యారు. ఎట్టి పరిస్థితుల్లో ఆరుగురి కార్మికుల జాడ త్వరగా గుర్తించేందుకు అధికారులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా, మిగిలిన 20మీటర్లలో కూడా ఎటువంటి ఆచూకీ లభించకపోతే, తదుపరి ప్రణాళికా ఏంటా అని అధికారులు ఆలోచనలో పడ్డారు. డేంజర్ జోన్‌గా ప్రకటించిన ఆ 40 మీటర్ల కింద చిక్కుకున టీబీఎం మిషన్‌తో పాటు ఒక వేళ కార్మికులు కూడా అక్కడే ఉంటే, ప్రస్తుతానికి తవ్వకాలు చేపట్టడమంటే ప్రాణాల మీదకు తెచ్చుకున్నట్లే అని సహాయక చర్యల్లో పాల్గొనే అధికారులు అభిప్రాయ పడుతున్నారు.

తండ్రి, కుమారుడి అదృశ్యం



బర్రు శ్రీను (ఫైల్)

మిడ్జిల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని బోయిన్‌పల్లి గ్రామానికి చెందిన బ ర్రు శ్రీను (39) తన కుమారుడు శేషా ంక్(6)తో కలిసి ఈ నెల 12వ తేదీ నుంచి కనిపించకుండా పోయారు. సోమవారం శ్రీను భార్య జంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. శ్రీను ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవపడి తన కుమారుడి పాఠశాలకు వెళ్లి.. పాఠశాల వద్దనుంచి శేషాంక్‌ను తీసుకొని వెళ్లినట్లు తెలిపారు. బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోవడంతో జంగమ్మ తమకు సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. అదృశ్యమైన వారి వివరాలు తెలిస్తే వెంటనే తమకు తెలియజేయాలని ఎస్సై కోరారు.

పిల్లలతో కలిసి మహిళ...

మిడ్జిల్ మండలంలోని చిలువేరు గ్రామానికి చెందిన మల్లేపల్లి హుస్సేన్ తన భార్య అలివేలు, తన కూతుళ్లు, కుమారుడితో కలిసి ఈనెల 4వ తేదీనుంచి కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సోమవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. ఇంట్లో చిన్న పాటి గొడవతో అలివేలు పిల్లలతో కలిసి వెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు. అదృశ్యమైన వారి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే వెంటనే తమకు గాని, తమ స్టేషన్‌కు సమాచారం అందజేయాలని ఎస్సై తెలిపారు.

మహిళ అదృశ్యం

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లోని టీచర్స్‌కాలనీలో నివాసం ఉంటున్న మహిళ అదృశ్యమైంది. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన దీపిక(26) టీచర్స్‌కాలనీలో నివాసం ఉంటుంది. ఈనెల 10 మధ్యాహ్నం తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇంటినుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం ఆమె సోదరుడు దీపక్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుమేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి ఆచూకీ లభ్యం

గద్వాల క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గత ఆరు రోజుల క్రితం కనిపించకుండా పోయిన యువతిని పోలీసులు గుర్తించినట్లు పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గద్వాల పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో విదులు నిర్వహిస్తూ ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్న యువతి ఈ నెల 8వ తేదీన కనిపించకుండా పోవడంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది. అయితే ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఆమె సెల్‌ఫోన్ ఆధారంగా ఆచూకీని గుర్తించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆ యువతి సెల్‌ఫోన్ ఆధారంగా సోమవారం ఆచూకీని గుర్తించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

గద్వాల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గద్వాల మండల పరిధిలోని పరమాల శివారులో సోమవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించి రూ.15వేల నగదు, ఆరు సెల్‌ఫోన్లు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న పదిమందిలో ఆరుగురిని పట్టుకొని కేసు నమోదు చేశారు. మిగిలిన నలుగురు పరారయ్యారు. వారిపై కూడా కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

యువకుడి మృతిపై కేసు నమోదు

బల్మూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండల పరిధిలోని జీన్‌కుంట గ్రామానికి చెందిన ధనుంజయ(30) అనే వ్యక్తి ఆదివారం కేఎల్‌ఐ కాల్వలో మోటారు బిగిస్తూ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని కొందరితో కలిసి కాల్వలో మోటారు బిగిస్తూ బయ టకు రావడానికి ప్రయత్నించాడు. కర్రల కు కట్టిన విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురి కాగా పక్కన ఉన్న వారు వెంటనే అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స నిర్వహిస్తుండగా మృతి చెందాడు. మృతుడి భార్య శ్రీలత సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ రమాదేవి తెలిపారు.

న్యూస్ బాక్స్

ముగిసిన అఖండ దీపారాధన

దేవరకద్ర, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్య స్వామి ఆలయంలో సప్తమ వహోత్సవాల్లో భాగంగా ఆలయంలో 11 రోజుల పాటు ఏర్పాటు చేసి అఖండ దీపారాదన సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అంతకుముందు ప్రత్యేక భజనలు చేసి, దీపారాధన ముగించారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

గండీడ్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని సాలర్‌నగర్‌లో మూడు రోజులుగా బొడ్రాయి, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే పాల్గొని రూ.50 వేలు విరాళంగా అందించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఈశ్వరయ్య, రాంరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు నర్సప్ప, ఆంజనేయులు, సాయిలు, గోపాల్, శివప్ప, రాములు పాల్గొన్నారు.

వైభవంగా భద్రకాళి వీరభద్రుడి కల్యాణం



వీరభద్రస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కోయిలకొండ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీరభద్రస్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం భద్రకాళి వీరభద్రుడి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. అంతకుముందు వీరభద్రస్వామికి ఫల పంచామృతాభిషేకం, సహస్ర బిల్వార్చన పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున నిర్వహించిన అగ్నిగుండం కార్యక్రమానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అంతకుముందు భక్తులకు అన్నదానం నిర్వహించారు. దేవాలయ నిత్య అన్నదాత శివకుమార్, నిర్వాహకులు తమ్మళి విజయ్‌కుమార్, రాజు, రాము, విజయ్, దిలీప్, భరత్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

మూసాపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండలం కాటవరం తండా సీతారాముల వారి ఆలయంలో ఆంజనేయ స్వామి, నవగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల నాయకులు నాగిరెడ్డి, తోట శ్రీహరి, విజయమోహన్‌రెడ్డి, షఫీ అహ్మద్, రాచాల రాధిక, భనదీశ్వర్ పాల్గొన్నారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి, నాయకులు రాజునాయక్, కొండన్న పాల్గొన్నారు

కాంగ్రెస్ పాదయాత్ర



నాయినోనిపల్లిలో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హన్వాడ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాయినోనిపల్లి, కొనగట్టుపల్లి గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ నాయకులు జై భీమ్, జైబాపు, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ యాత్రను కొనసాగించారు. పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్, నాయకులు నర్సిములు, తిరుపతయ్య, మోహన్, శ్రీశైలం, కృష్ణయ్య, సత్యయ్య, మోహన్, కేశవులు పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన రామలింగేశ్వర ఆలయం



అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు

చిన్నచింతకుంట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్న వడ్డెమాన్ గ్రామ సమీపంలోని రామలింగేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున నంది కోళ సేవ నిర్వహించారు. అనంతరం అగ్నిగుండంలో భక్తులు నడిచారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతమంతా శివనామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

▸▸ నివాళి అర్పించిన ఎమ్మెల్యేలు యెన్నం, జీఎంఆర్, ప్రజాప్రతినిధులు



నివాళి అర్పిస్తున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు



ఎదిరలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నివాళి అర్పిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్, పాలమూరు ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని డీసీసీ కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లాకొత్వాల్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, నాయకులు వినోద్‌కుమార్, ఆనంద్‌కుమార్‌గౌడ్, సంజీవ్‌ముదిరాజ్, బెక్కరి అనిత, జహీర్‌అక్తర్, చంద్రకుమార్‌గౌడ్, సీజె బెనహర్, షబ్బీర్ అహ్మద్, ఎన్‌పీ వెంకటేశ్, సిరాజ్‌ఖాద్రి, సాయిబాబ, అజ్మత్ అలీ, అవేజ్ పాల్గొన్నారు.

జిల్లా కోర్టు ఆవరణలో..

జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయవాదుల సంఘం భవనం ఎదురుగా అంబేడ్కర్ చిత్రపటానికి న్యాయవాదులు పూలమాల వేసి నివాళ్ళర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనంతరెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటయ్య, సంయుక్త కార్యదర్శి నాగోజి, కోశాధికారి వెంకట్రావు, మీడియా సెల్ ఇన్‌చార్జి కృష్ణ, సీనియర్ న్యాయవాదులు వినోద్‌కుమార్, యోగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

● దేవరకద్ర : అంబేడ్కర్ సేవలు మరువలేనివని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండా ప్రశాంత్‌రెడ్డి, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఎమ్మార్పీఎస్ నాయకుడు దొబ్బలి ఆంజనేయులు, వెంకట్రాములు అన్నారు. దేవరకద్ర, కౌకుంట్ల మండలాల్లో అంబేడ్కర్‌కు నివాళి నిర్వహించారు.

● నవాబ్‌పేట : అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామని మార్కెట్ చైర్మన్ హరలింగం అన్నారు. అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు రాంచంద్రయ్య, హమీద్, నీలకంఠంతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు.

అంబేడ్కర్ అగ్రగణ్యుడు : మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్ల : మహనీయుల జాబితాలో అంబేడ్కర్ అగ్రగణ్యుడని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ సి.లక్ష్మారెడ్డి అన్నారు. జడ్చర్ల పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా, పాతబజారు, మండలంలోని కొండేడులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అంబేడ్కర్ ఆశయాలు, ఆలోచనలకు అనుగుణంగా సమసమాజ స్థాపనకు కృషి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జడ్చర్ల మండలం ఆలూరు గ్రామంలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలకృష్ణ ఘనంగా నిర్వహించారు.

అంబేడ్కర్ అందరివాడు : పీయూ వీసీ



నివాళి అర్పిస్తున్న పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ రూరల్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడని పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం పీయూలో పరిపాలన భవనంలో అంబేడ్కర్ చిత్రపటానికి పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమేష్ బాబుతో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించారు. పీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు. కోటకదిరలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు.

మహనీయుడు అంబేడ్కర్

- ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

భూత్పూర్ : ప్రపంచ దేశాలు గర్వించదగ్గ మహనీయుడు, ఐక్యరాజ్య సమితిలో చోటు సంపాదించిన గొప్ప సంఘ సంస్కర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను అణిచివేయాలన్న ఆలోచనలో బీజేపీ కుట్ర పన్నుతోందని ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి అన్నారు. సోమవారం భూత్పూర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం అక్కడే స్థానిక యువకులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి, యువకులను అభినందించారు. జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటనర్సిహ్మారెడ్డి, మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హర్యానాయక్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూపతిరెడ్డి, తహసీల్దార్ జయలక్ష్మి, మునిసిపల్ కమిషనర్ నురూల్ నజీబ్, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు పద్మ పాల్గొన్నారు. అంతకుముందు బీఆర్‌ఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

● మహబూబ్‌నగర్ అర్బన్ : జిల్లా క్రీడా శాఖ కార్యాలయంలో డీవైఎస్‌వో శ్రీనివాస్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు.

● మహబూబ్‌నగర్ కలెక్టరేట్ : కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దేశం గర్వించదగ్గ నాయకుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని బీజేపీ రాష్ట్ర కోషాధికారి బండారి శాంతకుమార్ అన్నారు. ఏనుగొండలో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

● గండీడ్ : అంబేడ్కర్ ఆశయాలు నెరవేర్చాలని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప అన్నారు. మండలంలోని రంగారెడ్డిపల్లిలో పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

● రాజాపూర్/కోయిలకొండ/మిడ్జిల్/ చిన్నచింతకుంట బాలానగర్ : రాజాపూర్, కోయిలకొండ, మిడ్జిల్, చిన్నచింతకుంట బాలానగర్ మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంఈవో సుధాకర్, మాజీ ఎంపీపీ నర్సింములు పాల్గొన్నారు.

● మూసాపేట : మూసాపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అడ్డాకుల మండల కేంద్రంలో కేవీపీఎస్ మండల కమిటీ, ఆదర్శ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళి అర్పించారు.

● మహబూబ్‌నగర్ న్యూటౌన్ : రిషి జూనియర్ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి కళాశాల చైర్‌పర్సన్ చంద్రకళా వెంకటయ్య పూలమాల వేసి నివాళి అర్పించారు. అడ్మినిస్ట్రేటివ్ డీన్ భూపాల్‌రెడ్డి, అకాడమిక్ డీన్ లక్ష్మారెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మాజీ మునిసిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడెం ఆంజనేయులు నివాళి అర్పించగా, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మద్దియాదిరెడ్డి, నాగరాజు, లక్ష్మీనారాయణ, డీకే ఆంజనేయులు, హన్మంతు నివాళి అర్పించారు.

ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో..

యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రవికుమార్, వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు కిష్టయ్య, హేమంత్‌కుమార్, జయంతి, ఉమాదేవి, వేణుగోపాల్, శివరాజ్, పీఆర్టీయూ తెలంగాణ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ యుగంధర్‌రెడ్డి, శ్యాంబాబు, భూపతిసింగ్, శివానంద్, మహిపాల్‌రెడ్డి, పర్వతాలు, సురేష్, జీటీఏ గౌరవ అధ్యక్షుడు నాగం రఘురాంరెడ్డి, వెంకటస్వామి, వెంకటరాములు, నాగరాజు, శివప్రసాద్, బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు, పీఆర్టీయూ అధ్యక్షుడు మదన్ మోహన్ యాదవ్ అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు.

లబ్ధిదారులందరికీ సన్నబియ్యం

▸▸ సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో ఎమ్మెల్యే యెన్నం భోజనం



లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేయడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. సోమవారం నగరంలోని టీడీ గుట్టకు చెందిన లబ్ధిదారుడు చిరువ్యాపారి నర్సింహులు, పద్మమ్మ నివాసంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి భోజనం చేశారు. రేషన్ దుకాణంలో తీసుకొచ్చిన సన్నబియ్యాన్ని వండిన పద్మమ్మ ఎమ్మెల్యేతో పాటు నాయకులు, అధికారులకు వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారి అభిప్రాయం తెలుసుకున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు నెలకు రూ.1000-1500 ఆదా అవుతుందన్నారు. పద్మమ్మ తమకు మంచి భోజనం కడుపునిండా వడ్డించారన్నారు. తమ ఇంట్లో ఎమ్మెల్యే భోజనం చేయడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్, నాయకులు సాయిబాబ, చిన్న, ప్రశాంత్, నవనీత, చర్ల శ్రీనివాస్, శంకర్, సీఐ అప్పయ్య పాల్గొన్నారు.

అందరి సంతోషమే లక్ష్యం

హన్వాడ : ఇందిరమ్మ రాజ్యంలో అందరు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఇబ్రహీంబాద్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలు, బీసీలకు రూ.5 లక్షలు ఇంటి నిర్మాణానికి ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనిత, మండల అధ్యక్షుడు మహేందర్, జిల్లా కార్యదర్శి సీరాజ్‌ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించాలి



అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏటా ఏప్రిల్ 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తుందని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కిశోర్ అన్నారు. వారోత్సవాల్లో భాగంగా తొలిరోజు సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ మోహన్ రావు ఆధ్వర్యంలో అగ్నిమాపక పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం అగ్నిమాపక శాఖ కార్యాలయం ఆవరణలో జాతీయ అగ్నిమాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని అగ్నిమాపక శాఖ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా 1944 ముంబాయిలో జరిగిన బాంబే డాక్ పేలుడులో ప్రాణాలు కోల్పోయిన అగ్నిమాపక అమర వీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం అగ్నిమాపక ప్రమాదాలపై అవగాహన కోసం ఏర్పాటు చేసిన స్టాల్‌లో అగ్నిమాపక పరికరాలు, మానవ రక్షణ పరికరాలు, అత్యవసర సమయంలో ఉపయోగించే రక్షణ సామగ్రి పరికరాల ప్రదర్శన, వాటిని వినియోగించే పద్ధతులు, అగ్నిప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వారం రోజుల పాటు అగ్నిమాపక శాఖ కార్యాలయంలో స్టాల్ ఉంటుందని, ప్రజలు సందర్శించి అగ్ని ప్రమాదాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. స్టేషన్ ఫైర్ అధికారి మల్లికార్జున్, పద్మయ్య పాల్గొన్నారు.

● జడ్చర్ల : అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను సోమవారం జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో సీఐ కమలాకర్ విడుదల చేశారు. జడ్చర్ల ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ రాజేందర్ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాల కార్యక్రమాలను ప్రారంభించారు. అగ్నిమాపక విధుల్లో భాగంగా ప్రాణాలు కోల్పోయిన సిబ్బందికి ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ రాజేందర్ ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించారు. వారోత్సవాల మొదటి రోజు పోస్టర్ ఆవిష్కరణ, కరపత్రాలను విడుదల చేశారు. వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఫైర్‌ఆఫీసర్ రాజేందర్ తెలిపారు. లీడింగ్ ఫైర్‌మెన్‌లు లక్ష్మీకాంత్‌రెడ్డి, రాఘవేందర్, ఫైర్‌మెన్‌లు నవీన్‌కుమార్, రాజేష్, ఎస్‌ఐ జయప్రసాద్ పాల్గొన్నారు.



ప్రాణాలు కోల్పోయిన సిబ్బందికి నివాళి అర్పిస్తున్న ఫైర్ సిబ్బంది

రైతులు పండించిన ప్రతీ గింజను కొంటాం



నిజాలాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

భూత్పూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ప్రతీ గింజను కొంటామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మునిసిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి, మాట్లాడారు. సింగిల్ విండో అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, కార్యదర్శి రత్నయ్య, మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు నవీన్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ఏవో మురళీధర్ పాల్గొన్నారు.

● మూసాపేట : మండలంలోని నిజాలాపూర్‌లో సింగిల్ విండో ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీటీసీ మాజీ సభ్యుడు సీజీ గోవర్ధన్‌సాగర్ ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే రూ.500 బోనస్ పొందవచ్చన్నారు. నాయకులు రాంచందర్, శ్రీనివాస్‌రెడ్డి, పల్లె రవీందర్, శ్రీనివాసులు, రాములు, వెంకటేష్, రఘుపతి పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో అన్ని వర్గాల అభివృద్ధి

మూసాపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేద, బడుగు, బలహీన వర్గాలతో అన్ని పేద వర్గాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం అడ్డాకుల మండలం శాఖాపూర్‌లో ప్రాథమిక పాఠశాల అదనపు గదుల నిర్మాణ పనులు, సీఆర్‌ఆర్ నిధులతో ఎస్సీ కాలనీలో వివిధ అభివృద్ధి పనులు, జిల్లా పరిషత్ పాఠశాల పునరుద్ధరణ పనులు, పాఠశాల ప్రహరీ నిర్మాణం, వాల్మీకి, ఎస్సీ కమ్యూనిటీ హాల్ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం సీసీ రోడ్లు, హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. అంతకుముందు ఎమ్మెల్యేను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు నాగిరెడ్డి, మండల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట శ్రీహరి, డీసీసీ కార్యదర్శి విజయమోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాచాల రాధిక, మండల నాయకులు షఫీఅహ్మద్, శేఖర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న బెక్కం జనార్దన్

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలోనే గొప్పదైన భారత రాజ్యాంగం నేడు ఆపదలో చిక్కుకుందని, దాన్ని పరిరక్షించుకునే బాధ్యత జాతి జనులపైనే ఉందని ప్రముఖ న్యాయవాది బెక్కం జనార్దన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో తెలంగాణ సాహితి మహబూబ్‌నగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం పరిరక్షణ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మతోన్మాద శక్తులు రాజ్యాంగానికి తూట్లు పొడిచేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఎన్ని చట్టాలు ఉన్నా.. బడా రాజకీయ నాయకుల కారణంగా పేదవాడికి అందని ద్రాక్షగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కవులు రాజ్యాంగంలో ప్రజలకు కల్పించిన స్వేచ్ఛపై పలు కవితలు వినిపించారు. అనంతరం కవులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో లుంబిని లక్ష్మణ్ గౌడ్, తెలంగాణ సాహితీ రాష్ట్ర అధ్యక్షుడు వల్లభాపురం జనార్దన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖాజామైనోద్దీన్, కొప్పోలు యాదయ్య, విజేత వెంకట్‌రెడ్డి, జగపతి రావు. కాళిదాసు, ప్రచార్ కార్యదర్శి ఆర్ ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా దక్షిణామూర్తి విగ్రహ ప్రాణప్రతిష్ఠ



ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీనివాస కాలనీలోని ఊరగుట్ట వద్ద గల అయ్యప్ప ఆలయంలో సోమవారం దక్షిణామూర్తి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రాతఃకాల పూజలు, దీక్షా హోమము, మూలమంత్ర వాహనము, రక్షా హోమము, ధాన్యాదివాసము కార్యక్రమాలతో పాటు విష్ణు సహస్ర పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇరువెంటి రఘుపతి శర్మ, అఖిల భారత అయ్యప్ప సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

తెగిపోయిన చెక్‌డ్యాంను మరమ్మతు చేపట్టాలి



తెగిపోయిన చెక్‌డ్యాం

భూత్పూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతులమడుగు గ్రామ శివారులోని రాజీవ్ స్వగృహ ప్రాంతంలో ఉన్న వాగుపై ఏర్పాటు చేసిన చెక్‌డ్యాం గత వానాకాలంలో నీటి ఉధృతికి తెగిపోయింది. ఈ క్రమంలో నీరు మొత్తం కిందకు వెళ్లిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ చెక్ డ్యాం ఏర్పాటు చేయడం వల్ల పోతులమడుగు, శేరిపల్లి, అమిస్తాపూర్, హస్నాపూర్, భూత్పూర్ గ్రామాల శివారులో ఉన్న పొలాలకు ఎంతో మేలు చేకూరేదని ఆయా గ్రామాల రైతులు తెలిపారు. చెక్‌డ్యాం తెగిపోవడంతో భూగర్భ జలాలు పూర్తిగా ఇంకిపోతున్నాయని, బోరు బావుల్లో నీరు ఎండి పోయి, పంటలు చాలా వరకు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరు మాసాలు అవుతున్న సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో సంబంధిత (నీటి పారుదల) శాఖ ఏఈని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఆయన అందుబాటులోకి రాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తెగిపోయిన చెక్‌డ్యాంను మరమ్మతు వెంటనే చేయించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.